JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

మేడ్చల్ - మల్కాజిగిరి | గురువారం 21-08-2025
Medchal - Malkajgiri | Thursday 21-08-2025

jayabheri.news

సంపుటి : 02 | సంచిక : 88 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 88 | Pages : 8 | ₹: 5

హాలీవుడ్ కు చెందిన ప్రముఖ నటి, గ్లోబల్ ఐకాన్ ఏంజెలినా జోలీ కీలక నిర్ణయం తీసుకున్నారు. బ్రాడ్ పిట్‌తో విడాకుల ప్రక్రియ, న్యాయపరమైన పోరాటాలు ముగియడంతో ఇక అమెరికాను వీడి విదేశాల్లో స్థిరపడాలని ఆమె యోచిస్తున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ కేవలం పిల్లల కోసమే లాస్ ఏంజిల్స్ లో ఉండాల్సి వచ్చిందని, ఇకపై అక్కడ కొనసాగే ఉద్దేశం లేదని ఆమె తన సన్నిహిత వర్గాలతో చెప్పినట్లు తెలిసింది. బ్రాడ్ పిట్‌తో పిల్లల కస్టడీ ఒప్పందం కారణంగా తాను లాస్ ఏంజిల్స్‌లో నివసించాల్సి వచ్చిందని, లేదంటే అక్కడ ఉండాలనే ఆలోచన తనకు ఎప్పుడూ లేదని జోలీ గతంలో కూడా పలు సందర్భాల్లో చెప్పారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో తాను చూసిన మానవత్వం, ప్రశాంతత లాస్ ఏంజిల్స్‌లో కనిపించలేదని ఆమె ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.






## జీహెచ్ఎంసిలో కుంభకోణం

■ విజిలెన్స్ విచారణకు డిమాండ్

జయభేరి, హైదరాబాద్:

సంతోష్ నగర్ సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులు చేయకుండానే లక్షాలాది రూపాయలు కాజేశారని, విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి నేతలతో కలిసి కార్పొరేటర్ డీఎస్ నగర్ లోని పెండింగ్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిధుల దుర్వినియోగం పై జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కలిసి ఫిర్యాదు చేయడం. జరిగిందని తెలిపారు.. నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డ ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

2 లో




## తల్లిని చంపి నిజం దాచిన కొడుకు.. మరో కేసులో అరెస్ట్..

జయభేరి, నిజామాబాద్:

అమ్మ.. తన ప్రాణం పోతున్నా బిడ్డకు జన్మిస్తుంది. అమ్మ ప్రేమ దేనితో వెల కట్టలేనిది. బిడ్డ కోసం ఎంత కష్టమైన భరించే త్యాగం తల్లిది. అయితే డబ్బు కోసం నవమోసాలు కని, పెంచిన తల్లినే చంపేశాడు ఓ కిరాతకుడు. మానవత్వానికే ఈ ఘటన మాయని మచ్చగా నిలుస్తుంది. రోజురోజుకు మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనం. బీమా సొమ్ముపై ఆశపడి కన్నతల్లిని అత్యంత కిరాతకంగా చంపిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం తాండూరు గ్రామంలో ఈ దారుణం జరిగింది.

2 లో




## ఏఐకి అమ్మను గుర్తు చేయండి.. లేదంటే.. అంతమే

లాస్ వెగాస్‌లో జరిగిన ఏఐ 4 సదస్సులో ఆయన ఏఐ భవిష్యత్ పోకడల మీద మాట్లాడారు. అదే పరిస్థితి వచ్చిన రోజు.. ఏఐని వినయ, విధేయతలు కలిగిన దానిగా ఉంచేందుకు మనిషి చేసిన ప్రయత్నాలన్నీ ఫెయిల్ కావటం ఖాయమని ఆయన స్పష్టం చేశాడు. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత అనేవి.. మనుషుల కంటే.. ఏఐకే ఎక్కువని ఆయన ప్రకటించారు.

2 లో



# మహిళా రిజర్వేషన్లకు పునాది

మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రాల శాసనసభలకు పోటీ చేసే వయో పరిమితిని 25 ఏళ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించేందుకు తమవంతు కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం యువత చేతుల్లో ఉండాలన్న ఉద్దేశంతోనే రాజీవ్ గాంధీ ఓటు హక్కు పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, అదే స్ఫూర్తితో చట్ట సభల్లో పోటీ చేయడానికి వయో పరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు.

జయభేరి, హైదరాబాద్ :

భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న వారి విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఈ దేశంలో యువతకు అవకాశాలు కల్పించడానికి రాజీవ్ గాంధీ అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. చట్ట సభల్లో మహిళలకు సముచితమైన స్థానం కల్పించినప్పుడే సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి వీలు కలుగుతుందన్న సంకల్పంతో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు పునాది వేశారు. గాంధీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రాజీవ్ గాంధీ దేశంలో పారదర్శకమైన పరిపాలన, నిరుపేదలకు సంక్షేమ పథకాలు చేరడానికి ప్రభుత్వ నిర్ణయాల్లో సాంకేతిక నైపుణ్యాన్ని జోడించారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికాం రంగాల్లో తీసుకొచ్చిన సాంకేతిక సంస్కరణల వల్ల ఈరోజు తెలుగు రాష్ట్రాల ప్రజలు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. రాజీవ్ గాంధీ హయాంలో హైటెక్ సిటీకి వేసిన పునాది రాయి నేపథ్యం నుంచి క్రమేపీ హైదరాబాద్ ఈరోజు ఐటీ కంపెనీలు, డేటా, జీసీసీ సెంటర్లకు కేంద్రంగా, దేశంలోనే మొట్టమొదటి సిటీగా మారింది. వారి స్ఫూర్తితోనే హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ శ్రేణి అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతాం. అమరుడైన రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు పోతుంది. వారిని ఆదర్శంగా తీసుకునే గుండెకాయ లాంటి సచివాలయం ముందు వారి విగ్రహాన్ని ప్రతిష్టించుకున్నాం.." అని అన్నారు.

# హైదరాబాద్ లో పెరగనున్న రిజిస్ట్రేషన్ ధరలు




జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 20 :

తెలంగాణలో త్వరలోనే భూముల విలువ పెరగనుంది. భూముల ధర సవరించడంలో భాగంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తుది కసరత్తు చేస్తోంది. ఇటీవల జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి భూముల రిజిస్ట్రేషన్ ధర పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో మొదటగా కోర్ అర్బన్ రీజియన్‌లో భూముల విలువను సవరించే ప్రక్రియ దాదాపు మొదలైంది. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలుపుతారు. మొదటగా కోర్ అర్బన్ రీజియన్‌లో కొత్త విలువను అమల్లోకి తెస్తారని సమాచారం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఒక సంవత్సరం విరామం తర్వాత, హైదరాబాద్ కోర్ అర్బన్ ...మిగతాది 2 లో

# పేద కుటుంబాలకు గుడ్ న్యూస్

జయభేరి, విజయవాడ, ఆగస్టు 20 :

రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిళ్లు ఉండాలని... ఇందుకోసం తలపెట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించిన ముఖ్యమంత్రి... వీటిలో 3 లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గృహ ప్రవేశాలు జరగాలని స్పష్టం చేశారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో సమీక్షించిన సీఎం...రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలని ఆదేశించారు. దీనిపై 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు ఇవ్వాలని చెప్పారు.



రాష్ట్రానికి పీఎంఏవై(అర్బన్)బీఎల్సీ, పీఎంఏవై (గ్రామీణ్), పీఎం జన్మాన్ కింద మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో ఇప్పటికి 9,51,351 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలోనే 2.81 లక్షల ఇళ్ల ...మిగతాది 2 లో

## ఢిల్లీ సీఎం రేఖా గుప్తా పై దాడి

■ గట్టిగా రెండు సార్లు ఆమె చెంపపై కొట్టి జుట్టు పట్టుకుని మరీ బాదిన వైనం



జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 20:

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా పై బుధవారం దాడి జరిగింది. సీఎం నివాసంలో జన్ సున్వాయి కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఆ అటాక్ జరిగింది. తన సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తి సీఎం రేఖా గుప్తాపై అకస్మాత్తుగా దాడి చేశాడు. ఆ వ్యక్తి 30 ఏళ్ల ఉంటాడని బీజేపీ నేతలు చెబుతున్నారు. సీఎంపై దాడి చేసిన వ్యక్తిని.. అక్కడ ఉన్న సీఎం సిబ్బంది తక్షణమే అదుపులోకి తీసుకున్నారు. పబ్లిక్ మీటింగ్‌లో సమస్య చెప్పుకునేందుకు వచ్చిన వ్యక్తి ఎందుకు దాడికి పాల్పడ్డారన్న కోణంలో విచారణ నిర్వహిస్తున్నారు. గట్టిగా రెండు సార్లు ఆమె చెంపపై కొట్టినట్లు తెలుస్తోంది. జుట్టు పట్టుకుని మరీ బాదినట్లు చెబుతున్నారు. జుట్టు పట్టి పీకడంతో.. తలకు గాయాలైనట్లు తెలుస్తోంది

## మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తు

■ ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ విడుదల



జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 20:

తెలంగాణలో మద్యం దుకాణాల ఆశావాహులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుకు ఆబ్కారీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, దరఖాస్తుల ఫీజు కూడా భారీగా పెంచేసింది. దరఖాస్తు పీజు రూ. 2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచినట్లు పేర్కొంది. వచ్చే రెండేండ్ల కాల పరిమితి (2025 డిసెంబర్ నుంచి 27 నవంబర్ వరకు)కి కి సంబంధించి లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాల లైసెన్సులను ఎంపిక చేయనుంది. మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించనుంది. మద్యం దుకాణాలకు 6 శ్లాబ్‌లలో ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లు జారీ చేయనుంది.




■ ఆర్థిక రాజధాని అతలాకుతలం

జయభేరి, ముంబై :

ఎటు చూసినా మోకాలి లోతు నీళ్లు. భారీ వర్షాలు ముంబైని ముంచెత్తాయి. అనేక ప్రాంతాల్లో రోడ్లు మునిగిపోయాయి. అయినా వాటిల్లో నుంచే వాహనదారులు వాహనాలు నడపాల్సి వచ్చింది. ఇదిలావుంటే ఆగస్టు 20 వరకు నగరంలో అతి భారీ వర్షాలు కురుస్తాయని IMD హెచ్చరించడం ప్రజలను మరింత భయపెడుతోంది. ఇక నవీ ముంబైలో కూడా రోడ్లు జలమయం అయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ముంబై అంబేద్కర్ మార్గ్, లేడీ జహంగీర్ రోడ్ వద్ద ఇదే పరిస్థితి. మోకాలి లోతు నీరు పేరుకుపోవడంతో ప్రజలు నడవడానికి సైతం ఇబ్బంది పడ్డారు. వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఏడుగురు చనిపోయారు.. ముంబైలో జరిగిన వేర్వేరు విషాద ఘటనలు తీవ్ర ఆవేదనకు గురిచేశాయి. కేవలం 81 గంటల వ్యవధిలోనే ముంబైలో 550 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది దాదాపు ఆగస్టు నెల సగటు వర్షపాతంతో సమానం. నగరానికి తాగునీరు అందించే ఏడు సరస్సులలో ఒకటైన విరార్ సరస్సు నిండి పొంగిపొర్లింది. రత్నగిరి, రాయగడ్, హింగోలి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఫడ్నవీస్ ఆదేశించారు. ముంబైలో ప్రస్తుతం జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లు, కాలనీలు అన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, అంధేరి సబ్‌వే, లోఖండ్‌వాలా కాంప్లెక్స్ వంటి ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. ఈ భారీ వర్షాల కారణంగా పట్టాలు మునిగిపోయి లోకల్ ట్రైన్స్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంబైకి వచ్చే పలు రైళ్లను దారి మళ్లించారు. వర్షాల ప్రభావం విమాన రాకపోకలపై కూడా తీవ్రంగా పడింది. ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## జీహెచ్ఎంసిలో కుంభకోణం

డీఎస్ నగర్ లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం రూ.18.60లక్షలు, అంగన్వాడీ సెంటర్ పక్కన మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో మిగిలిన పనులకు రూ.10.50 లక్షలు, ఎస్బీహెచ్ కాలనీ నుంచి సుబ్రమణ్యం నగర్ వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ. 22 లక్షలు కేటాయించి టెండర్ ఖరారు చేశారని పేర్కొన్నారు. పనులు ప్రారంభించకుండానే పూర్తి చేసినట్లుగా కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ ఇంజ నీరింగ్ అధికారులతో కుమ్మక్కై బోగస్ పత్రాలు, ఎంబీ బుక్కులు సృష్టించి నిధులు కాజేశారని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులు ఇచ్చిన పనుల వివరాలను కమిషనర్ కు అందజేయడం జరిగిందని వెల్లడించారు. నాలుగేళ్లుగా జరిగిన టెండర్ల పై విజిలెన్స్ విచారణ చేపట్టి సొమ్ము రికవరీ చేయాలని కోరారు. లేకుంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## మరో కేసులో అరెస్ట్..

అయితే ఓ కేసులో అరెస్ట్ చేసిన నిందితుడిని విచారించగా.. 8నెలల క్రితం తల్లిని చంపిన విషయం బయటపడింది. జనవరి 9న తాండూరు గ్రామానికి చెందిన చాకలి జమున మరణించింది. ఇంట్లో కిందపడి ప్రమాదవశాత్తు చనిపోయిందని మొదట పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆమె కొడుకు రాజు ఇటీవల ఓ హత్యాయత్నం కేసులో పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని విచారిస్తున్నప్పుడు.. జమున మరణానికి సంబంధించిన అసలు నిజం బయటపడింది. రాజు తల్లి జమున పేరు మీద వివిధ బీమా సంస్థలలో దాదాపు రూ. 80 లక్షల ప్రమాద బీమా ఉంది. ఆ డబ్బుపై ఆశ పెంచుకున్న రాజు, తన తల్లిని చంపితేనే ఆ సొమ్ము తనకు దక్కుతుందని భావించాడు. అందుకే ఆమె ఇంట్లో ఉన్నప్పుడు తలపై బండరాళ్లతో దారుణంగా కొట్టాడు. తీవ్ర గాయాలైన జమున అక్కడికక్కడే మరణించింది. ఈ విషయం బయటపడకుండా ఆమె ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయినట్లు పోలీసులను నమ్మించాడు. చివరకు మరో కేసులో విచారిస్తున్నప్పుడు తన తల్లిని తానే హత్య చేసినట్లు రాజు అంగీకరించాడు. దీంతో పోలీసులు జమున కేసును తిరిగి విచారణ చేపట్టారు. ఈ ఘటన సమాజంలో మనుషుల మధ్య సంబంధాలు ఎంతగా దిగజారుతున్నాయో తెలియజేస్తోంది. డబ్బు ఆశ కోసం కన్నతల్లిని చంపుతున్న దారుణాలకు ఇది నిదర్శనం.

## ఏఐకి అమ్మను గుర్తు చేయండి.. లేదంటే.. అంతమే...

ఈ నేపథ్యంలో.. ఏఐ సిస్టమ్స్‌కు మాతృత్వ భావనలను.. జోడించడం వల్ల మానవుల పట్ల అవి బాధ్యతగా, ప్రేమగా ఉండేలా వాటిని గైడ్ చేయవచ్చిన హింటన్ అభిప్రాయపడ్డారు. హింటన్ డీప్ లెర్నింగ్ టెక్నాలజీస్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఏఐ అంతిమంగా మానవుడి అంతానికి దారి తీసే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని గతంలోనే ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ఏఐ సిస్టమ్‌ను కట్టుదిట్టమైన మానవ నియంత్రణ అదుపు చేయగలుగుతోందని, రాబోయే రోజుల్లో అది సాధ్యం కాకపోవచ్చని ఆయన వాదిస్తున్నారు. ఇటీవల.. ఒక ఏఐ సిస్టమ్ అక్కడ పనిచేసే ఇంజినీరును బెదిరించే ప్రయత్నం చేసింది. దీనిని గుర్తుచేస్తున్న హింటన్.. రాబోయే రోజుల్లో ఏఐ మోడల్స్ కూడా అబద్ధాలు చెప్పటం, మోసం చేయటం వంటి మానవ లక్షణాలను సంతరించుకుంటాయని, అదే జరిగితే.. ఇక వినాశనమేనని హింటన్ ఆందోళన వ్యక్తం చేశాడు.

## హైదరాబాద్ లో పెరగనున్న రిజిస్ట్రేషన్ ధరలు

రీజియన్ లో WP ఆస్తి రిజిస్ట్రేషన్ విలువల పునఃసమీక్షను ప్రారంభించింది. ఈ కొత్త రేట్లు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల అధికారిక రిజిస్ట్రేషన్ విలువ పెరగడంతో పాటు ప్రస్తుత మార్కెట్ ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాని తగ్గించడమే రేవంత్ సర్కార్ లక్ష్యం.ఔటర్ రింగ్ రోడ్ (ORR) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ రాష్ట్రంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు సుమారు 60 శాతం నుంచి 70 శాతం ఆదాయాన్ని అందిస్తోంది. 2021లో చివరిసారిగా రిజిస్ట్రేషన్ రేట్లు పెంచినప్పటికీ కోకాపేట్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రముఖ ప్రాంతాలలో ఉన్న ప్రస్తుత మార్కెట్ ధరలతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయి. ఈ వ్యత్యాసంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గడంతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు, అమ్మేవారు తక్కవ ధరలు చూపిస్తున్నారు. భూముల ధరల పునఃసమీక్షలో తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానికి సంవత్సరానికి అదనంగా ₹2,000 కోట్ల నుంచి ₹2,500 కోట్ల వరకు ఆదాయం తెస్తుందని అంచనా వేశారు. ఈ పెంపు అవసరమని, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో అసలు రేట్లతో బిజినెస్ జరుగుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. గత మూడేళ్లుగా ఐటీ, ఫైనాన్షియల్ సేవలకు డిమాండ్ పెరిగిన కారణంగా ఇళ్ల ధరలు వేగంగా పెరిగాయి. ఈ పునఃసమీక్ష భూముల రిజిస్ట్రేషన్లలో పారదర్శకత తీసుకొస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రతిపాదనకు ముందుగా డెవలపర్లు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన స్టేక్‌హోల్డర్లు వ్యతిరేకత వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ విలువలు పెరగడం వలన రియల్ ఎస్టేట్ డిమాండ్ తగ్గిపోతుందని ప్రభుత్వానికి తెలిపారు. కొనుగోలుదారులు అధిక ధరల వలన ఇళ్లు కొనరని కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధంగా భూముల ధర పెరుగుదల తాత్కాలిక ప్రభావం చూపుతుందని.. పెట్టుబడులు పెరిగి రియల్ ఎస్టేట్ కు మళ్లీ బూమ్ వస్తుందని అధికారులు దీమా వ్యక్తం చేశారు.కొత్త రేట్లకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తైన వెంటనే పెరిగిన భూముల ధర అమలు చేస్తారని అంచనా. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ మార్పు లావాదేవీల సంఖ్యపై ప్రభావం చూపినా, దీర్ఘకాలంలో మార్కెట్ రేట్లు, ప్రభుత్వ రికార్డుల మధ్య వ్యత్యాసాని తగ్గిస్తుంది. దేశంలో ముఖ్యమైన రియల్ ఎస్టేట్ బూమ్ ఉన్న నగరాలలో హైదరాబాద్ ఒకటి. నివాస, వాణిజ్య రంగాల్లో ఎప్పుడూ డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. అయితే ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించడంతో పాటు మార్కెట్లో భూమి ధరలు, రిజిస్ట్రేషన్ భూమి ధరల్లో వ్యత్యాసం తగ్గించి పారదర్శకత తీసుకు రావాలని భూముల ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## పేద కుటుంబాలకు గుడ్ న్యూస్

నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వచ్చే నెలలో ఇంకో 19 వేల ఇళ్లు అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాది కాలంలో గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,013.50 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన మొత్తం 4,305 లేఅవుట్లలో... రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలికవసతుల కోసం రూ.3,296.58 కోట్ల వ్యయం కానుంది. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా, రాష్ట్రంలోని 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో చెల్లించనుంది. పీఎం జన్మాన్ కింద నిర్మించిన 15,753 ఇళ్లకు రూ.100 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద నిర్మించిన 15,582 ఇళ్లకు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద ఇళ్లు మంజూరైనప్పటికీ 1,84,510 మంది లబ్దిదారులు ఇంకా గృహ నిర్మాణం చేపట్టలేదని అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు.

**తుది దశకు 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం :**

2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 టిడ్కో ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో 300 చ.అ. విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చ.అ. విస్తీర్ణం ఉన్న 12,550 ఇళ్లు, 430 చ.అ. విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు... మొత్తం 83,570 ఇళ్లను లబ్దిదారులకు ప్రభుత్వం అందించింది. మరో 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరింది.

## మునిగిన ముంబై..

ప్రతికూల వాతావరణం, వెలుతురు సరిగా లేకపోవడంతో ముంబై విమానాశ్రయంలో దిగాల్సిన తొమ్మిది విమానాలు ల్యాండింగ్‌ను రద్దు చేసుకుని గాల్లోనే చక్కర్లు కొట్టాయి..మరో విమానాన్ని అధికారులు వేరే నగరానికి మళ్లించారు. మరో రెండ్రోజులు ముంబైతో పాటు థాణె, రాయ్‌గఢ్, పాల్ఘర్, నాసిక్ ఘాట్ ప్రాంతాలకు IMD రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

# గగన రాగాల వనం మనసును తాకిన హిమగీతం

**మనిషి తన జీవన యాత్రలో ఎప్పుడూ ప్రకృతితోనే మమేకమై ఉంటాడు. గాలి, వెలుగు, వాన, ఎండలతో అతని శరీరం స్పందిస్తుంది, మనసు స్పందిస్తుంది. విశ్వం నిరంతరంగా తన క్రమాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. కానీ ఆ క్రమాన్ని మనం అనుభవించే విధానం మాత్రం ప్రతి కాలంలో కొత్తగా ఉంటుంది. ఉదయం వెలిగే సూర్యుడిని చూసి ఎవరో శాస్త్రాన్ని గుర్తిస్తారు, మరెవరో కవిత్వాన్ని కనుగొంటారు. రాత్రి కమ్ముకున్న చీకటిని ఎవరో భయంతో అర్థం చేసుకుంటారు, ఇంకెవరో ఆకాశాన్ని చీల్చిన నక్షత్రాలను ఆశగా చూస్తారు. ఈ విశ్వ గమనంలో కలిగే ప్రతి చిన్న మార్పుకూడా మనిషి జీవితాన్ని ఒక కొత్త అనుభూతిగా మలుస్తుంది. కొన్ని క్షణాలు మనకు ఆప్యాయమైన చల్లదనాన్ని ఇస్తాయి, కొన్ని క్షణాలు ఆందోళన కలిగిస్తాయి, మరికొన్ని మనలోని సృజనాత్మకతను రగిలిస్తాయి. ప్రకృతి అనేది కేవలం గమనించాల్సిన దృశ్యం మాత్రమే కాదు, అది మనసులో ప్రతిధ్వనించే ఒక అనుభవం. ఆ అనుభవం కవిత్వంగా మారినప్పుడే మనిషి జీవన గాథ మరింత సంపూర్ణమవుతుంది.**

**జయభేరి, హైదరాబాద్ :**

ఆకాశం మనకిచ్చే అనుభూతులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కాలచక్రం తిరుగుతూ వచ్చిన ప్రతి ఋతువుకి ఒక ప్రత్యేకత, ఒక మనసును తాకే రహస్యముంటుంది. నిన్నటి వేడిమి ఈరోజు చల్లదనమవుతుంది, ఈరోజు గాలివాన రేపటి మధురమైన వెలుగుగా మారుతుంది. ఇలాంటి మార్పుల మధ్యలో మనసు ఆగి ఒక ప్రశ్న వేసుకుంటుంది... మన చుట్టూ జరుగుతున్న ఈ విశ్వగమనానికి మనమూ అనుసరించేవాళ్లమేనా? లేక ఆ అనుభూతులను మనలోకి మలచి కొత్త సాహిత్యాన్ని రాసుకునేవాళ్లమా? ఇటీవలి రోజుల్లో చాలా మందిని ఆకర్షించిన ఒక పదం "అప్హేలియన్". ఇది నిజంగా ఖగోళ శాస్త్రపరమైన పదమే. కానీ సోషల్ మీడియాలో ఇది అనుకోని వర్ణనలతో మన ముందుకొచ్చింది. సూర్యుడు, భూమి మధ్య దూరం పెరిగినప్పుడే అప్హేలియన్ జరుగుతుంది. అయితే అది ప్రతి ఏడాది జూలై నెలలోనే గమనించబడుతుంది. ఈ సంవత్సరం కూడా జూలై మూడవ తేదీకి ఆ సంఘటన ఇప్పటికే పూర్తయ్యింది. కాబట్టి ఆగస్టు ఇరవై వరకు ఇది కొనసాగుతుందనే వాదనకు శాస్త్రీయ ఆధారమేమీ లేదు. అయినప్పటికీ మనం వింటున్న ఈ వర్ణనల వెనుక మనిషి గుండెలో నిక్షిప్తమై ఉన్న ఒక సున్నితమైన కోరిక ఉంది... ప్రకృతి మనకు అందించే ప్రతీ మార్పునూ కవిత్వంగా మలచుకోవాలనే కోరిక!

చల్లని ఉదయాలు, ఆకస్మికంగా తగ్గిన ఉష్ణోగ్రతలు, శరీరానికి కలిగే చిన్న చిన్న ఇబ్బందులు... ఇవన్నీ మనం ఎదుర్కొనే సాధారణ అనుభవాలే. కానీ వాటిని ఒక విభిన్నమైన ప్రకృతి గాథగా చెప్పుకోవడం మన ఊహాశక్తికి చెందిన అందమైన మలుపు. ఇదే సాహిత్యదృష్టి. వాస్తవాన్ని ఒక అందమైన కథలా మలచి పంచుకోవడమే. ఈ ఊహను సత్యం అనుకోవాల్సిన అవసరం లేదు, కానీ అది మనలోని సృజనాత్మకతను మేల్కొలుపుతుంది. శరీరం జ్వరంతో వణికినా, గొంతు గరగరలాడినా, గాలి వీస్తూ మనసును చల్లబరిచినా... మనము అనుభవించే ప్రతి చిన్న అనుభూతి కూడా ఒక విశ్వకవిత్వమే! ఈ దశలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఒక అవసరం. విటమిన్లు, పండ్లు, తేలికపాటి ఆహారం... ఇవన్నీ మన శరీరానికి అండగా నిలుస్తాయి.

ఇలాంటి అనుభవాలను భయంకరంగా చిత్రీకరించడం సరికాదు. ఎందుకంటే ఇది అపశకునమూ కాదు, విపత్తూ కాదు. ఇది కేవలం ప్రకృతిలోని ఒక దినచర్య. కానీ ఈ ప్రకృతి దినచర్యలో మనిషి తన ఊహలకు రెక్కలు కట్టుకుని రాసే పదాలు మాత్రం శాశ్వతంగా నిలుస్తాయి. ఈ సందర్భంలో మనం ఒకరికొకరు పంచుకోవాల్సింది భయమో అనుమానమో కాదు, సహజమైన అనుభూతి మాత్రమే. ఉదయపు గాలిలో తేమ తడిసి మనసు ప్రశాంతంగా మారే క్షణాన్ని స్నేహితుడితో పంచుకోవడం, రాత్రి నక్షత్రాలను చూసి మన లోలోపల ఉద్భవించే ప్రశ్నలను కుటుంబంతో పంచుకోవడం... ఇదే అప్హేలియన్ మనకు ఇచ్చే నిజమైన వరం.



**ప్రకృతి మార్పులు మన జీవనశైలిపై ఎన్నో ప్రభావాలు చూపించాయి. ఒకప్పుడు ఎండలు పొడిగిపోయి భూమి పగుళ్లతో నిండిపోయింది. మరోసారి వర్షా లు అకాలంగా కురిసి నదులు పొంగిపొర్లాయి. కొన్నిసార్లు ఉత్తర దిశ నుంచి వచ్చిన గాలి విత్తనాలను ఎండబెట్టి పంటలను తగ్గించింది.**

ప్రపంచం మొత్తం ఒకే ఆకాశాన్ని చూసినా, ప్రతి మనసు చూసేది వేరు! ఎవరికో అది శాస్త్రసత్యం, ఇంకెవరికో అది సాహిత్యపు ప్రతిధ్వని. ఒకరికో చల్లని వణుకు, ఇంకొకరికో అది చల్లని కవిత్వం. ఈ రెండు దృక్కోణాలు కలిసినప్పుడే మనం సంపూర్ణంగా జీవించగలుగుతాము. అందుకే ఈ కాలాన్ని మనం ఒక ఆత్మీయమైన అనుభూతిగా భావించాలి. అది కేవలం శరీరంలో వణుకు కలిగించే చల్లదనం కాదు, మనలోని ఆలోచనలకు, సృజనాత్మకతకు కొత్త జ్యోతి వెలిగించే క్షణం!

గతంలో ప్రకృతి మార్పులు మన జీవనశైలిపై ఎన్నో ప్రభావాలు చూపించాయి. ఒకప్పుడు ఎండలు పొడిగిపోయి భూమి పగుళ్లతో నిండిపోయింది. మరోసారి వర్షాలు అకాలంగా కురిసి నదులు పొంగిపొర్లాయి. కొన్నిసార్లు ఉత్తర దిశ నుంచి వచ్చిన గాలి విత్తనాలను ఎండబెట్టి పంటలను తగ్గించింది. సముద్రతీర ప్రాంతాల్లో తుఫానులు దూసుకొచ్చి గ్రామాలను శిధిలం చేశాయి. అయితే ఈ ప్రతి సందర్భమూ మనిషి ధైర్యాన్ని పరీక్షించింది, కొత్త మార్గాలు ఆవిష్కరించే అవకాశాన్ని కూడా ఇచ్చింది. ప్రకృతి చేసే ప్రతి మలుపు మనిషికి ఒక సవాలు మాత్రమే కాదు, జీవన పాఠశాలలో ఒక కొత్త పాఠం కూడా.

("ఆగస్టు 19 నుండి 22, 2025 మధ్య చోటుచేసుకునే అప్హెలియన్ సమయంలో వాతావరణ మార్పులను గుర్తించి సమాజానికి అవగాహన కలిగించడమే ఈ వ్యాసం వ్రాసిన ఉద్దేశ్యం.")



డా. చిటికెన కిరణ్ కుమార్
యు ఎన్ ఐ సి సి డి ఆర్ పురస్కార గ్రహీత
ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు
ఐబిఆర్ఎఫ్ సభ్యులు
సెల్: 9490 841 284

# మన బలం.. బలగం అంతా అదే



ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట వేదికగా ఇచ్చిన 'మేడిన్ ఇండియా' పిలుపు దేశ పౌరులందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. భారతీయ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించాలని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో భారతీయుం.. భారత వస్తువులనే కొందాం అనే నినాదం విస్తృతమవుతోంది. జనంలోకి వెళ్తోంది. పండుగల వేళ.. ఇది శుభ పరిణామమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రాజ్యాంగం పౌరులకు హక్కులను అందించినట్లే, ప్రాథమిక బాధ్యతలను కూడా నిర్దేశించింది. రోడ్లు, డ్రైనేజీ బాగోలేకపోతే.. వ్యవస్థలను, అధికారులను, రాజకీయ నాయకులను తిట్టుకుంటాం. ఇలాగైతే దేశం ఎప్పుడు అభివృద్ధి చెందుతుందంటూ ఆవేదన చెందుతాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. అయితే, మన హక్కుల కోసం ఎలాగైతే గొంతెత్తుతామో.. దేశానికి అవసరమైనప్పుడు మన వంతు కర్తవ్యం నిర్వర్తించాల్సిన బాధ్యత కూడా మనపై ఉంది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక బాధ్యతల గురించి చిన్నప్పుడు పాఠశాలలోనే చదువుకున్నాం. అయితే, ఆ బాధ్యతలను పాటించాలనే విషయం మర్చిపోతుంటాం. దేశానికి అండగా నిలబడాలని ప్రధాని నరేంద్ర మోదీ.. ఆగస్టు 15న ఎర్రకోట వేదికగా ప్రజలకు పిలుపునిచ్చారు. 'మేడిన్ ఇండియా' వస్తువులనే వాడాలని పిలుపునిచ్చారు.భారతీయ వస్తువులను వాడితేనే, దేశం ఆత్మ నిర్భరత సాధిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. అయితే, దేశ అభివృద్ధిలో పౌరుల బాధ్యత కూడా కీలకమని ప్రధాని మోదీ గుర్తు చేశారు.

'మేడిన్ ఇండియా' వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఉద్యోగ అవకాశాలను సృష్టించడం సాధ్యమవుతుంది. ఈ బాధ్యతను ప్రతి పౌరుడు స్వీకరించాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో అనేక రంగాల్లో ఉత్పత్తులను తయారు చేస్తున్న స్థానిక బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి.

నిత్యావసర వస్తువుల నుంచి ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఔషధాల వరకు వివిధ రకాల ఉత్పత్తులను భారతీయ కంపెనీలు అందిస్తున్నాయి. వస్తువులు కొనుగోలు చేసే ముందు 'మేడ్ ఇన్ ఇండియా' లేబుల్‌ను తనిఖీ చేయడం ద్వారా స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వవచ్చు.'మేడిన్ ఇండియా' వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. ఈ చర్య దేశంలో డబ్బు రొటేషన్‌ను పెంచుతుంది, ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది, నిరుద్యోగ సమస్యను తగ్గిస్తుంది. స్థానిక ఉత్పత్తులకు డిమాండ్ పెరిగితే, కంపెనీలు ఉత్పత్తిని విస్తరించి, మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తాయి. ఇది దేశ జీడీపీని పెంచడమే కాక, రూపాయి విలువను బలోపేతం చేస్తుంది. అదనంగా, దిగుమతులపై ఆధారపడటం తగ్గడం వల్ల విదేశీ మారక నిల్వలు రక్షించబడతాయి. స్థానిక బ్రాండ్లకు మద్దతు ఇవ్వడం వల్ల కంపెనీలు ఆవిష్కరణలు, పరిశోధనలలో ఎక్కువ పెట్టుబడులు పెడతాయి, దీనివల్ల ఉత్పత్తుల నాణ్యత మెరుగవుతుంది. ఇది భారతీయ కంపెనీలను అంతర్జాతీయంగా పోటీపడే స్థాయికి తీసుకెళ్తుంది.చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులు, ముఖ్యంగా చవకైన ఎలక్ట్రానిక్స్, గ్యాడ్జెట్స్, భారతీయ మార్కెట్లో గణనీయమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఇవి కొనుగోలు చేయడం వల్ల దేశ ఆర్థిక వనరులు విదేశాలకు వెళ్తాయి, స్థానిక కంపెనీలకు నష్టం కలుగుతుంది. దీనిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దిగుమతి వస్తువులకు బీఐఎస్ ప్రమాణాలను తప్పనిసరి చేస్తోంది. చైనా వస్తువులకు బదులుగా 'మేడిన్ ఇండియా' ఉత్పత్తులను ఎంచుకోవడం ద్వారా స్థానిక పరిశ్రమలను రక్షించడమే కాక, దేశ ఆర్థిక స్వావలంబనను పెంపొందించవచ్చు.'మేడిన్ ఇండియా' ఉత్పత్తులను కొనుగోలు చేయడం కేవలం ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును రూపొందించే బాధ్యత. ప్రతీ కొనుగోలు నిర్ణయం దేశంలో ఉపాధి, ఆవిష్కరణ, ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ కొనుగోళ్లలో 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్' తనిఖీ చేయడం ద్వారా పౌరులు తమ వంతు కషి చేయవచ్చు. ప్రధాని మోదీ ఆశయం సాకారం కావాలంటే, ప్రతి భారతీయుడు ఈ బాధ్యతను స్వీకరించాలి.ఈ బ్రాండ్స్ మాత్రమే కాకుండా.. మనం ఏ వస్తువు తీసుకున్నా.. దాదాపు భారతీయ కంపెనీలు దాన్ని తయారు చేస్తున్నాయి. వస్తువులు తీసుకునే ముందు దానిపై 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్' చూడాలి. భారత్‌లో ఉత్పత్తి అయితే, ఇక్కడ 'మేడ్ ఇన్ ఇండియా' అని ఉంటుంది. ఆన్‌లైన్‌లో కూడా కంట్రీ ఆఫ్ ఆరిజన్ ఉంటుంది. విదేశీ బ్రాండ్స్ అయినా.. దానిపై మేడ్ ఇన్ ఇండియా అని ఉంటే.. ఆ వస్తువులు కూడా తీసుకోవచ్చు.మేడిన్ ఇండియా వస్తువులు కొంటే.. వాటికి డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా వాటిని కంపెనీలు ఎక్కువ ఉత్పత్తి చేయాల్సి వస్తుంది.

దీని కోసం ఆయా కంపెనీలు ఉద్యోగులను పెంచుకోవాల్సి ఉంటుంది. అలా ఉద్యోగులను నియమించుకుని కంపెనీలు ప్రొడక్షన్ పెంచితే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ఎక్కువ మంది దగ్గర డబ్బులు ఉంటే.. ఎక్కువ వస్తువులు కొనుగోలు చేయొచ్చు.మేడిన్ ఇండియా' వస్తువు కొనాలనుకున్నప్పుడు.. కేవలం ఒక ప్రొడక్ట్ మాత్రమే కొనడం లేదనే విషయం గుర్తుంచుకోవాలి. ఆత్మ నిర్భర, సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన భారత్ కోసం ఒక్కో ఇటుక పేరుస్తున్నట్లే. ప్రపంచ దేశాలతో పోటీ పడి భారత్ సూపర్ పవర్‌గా ఎదగాలంటే.. మనం ఈ పని చేయక తప్పదు.


# గుంతల రోడ్లపై ప్రయాణం అంటే ప్రాణాపాయంగా భావిస్తున్న ప్రజలు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇసుక తరలింపు పై ఉన్న శ్రద్ధ పాడైపోయిన రోడ్లను బాగు చేయడంలో లేదు
- భద్రాచలం టూ వెంకటాపురం ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మత్తులు నిర్వహించాలి
- కొండా చరణ్ బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచల నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు

**జయభేరి, చర్ల, ఆగస్టు 20 :**




చర్ల మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇసుక లారీల కారణంగా పాడైపోయిన ప్రధాన రహదారిని బాగు చేయాలని తక్షణమే మరమ్మత్తులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సామరస్యంగా శాంతియుతంగా ఆందోళన నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు స్థానిక ఎమ్మెల్యేకి నియోజకవర్గంలో ఉన్న ఇసుకని తరలించే పనిలో ఉన్న శ్రద్ధ ఆ ఇసుక తరలించడం వల్ల పాడైపోయిన రోడ్లను బాగు చేయడంలో లేదని విమర్శించారు భద్రాచలం నుండి వెంకటాపురం వరకు ఉన్న ప్రధాన రహదారి ఇసుక లారీల ధాటికి మొత్తం ధ్వంసం అయిందని కనీసం టూ వీలర్ తిరిగే అవకాశం కూడా లేకుండా పాడైపోయిందని అన్నారు ఉద్యోగస్తులు ఎవరు కూడా సమయానికి ఆఫీస్కి వెళ్లలేకుండా రోడ్లపై పడ్డాయి గుంటలు ఆటంకంగా మారాయని అన్నారు అంబులెన్స్ సైతం సమయానికి హాస్పిటల్కు చేరుకోవడం లేదని తెలిపారు విపరీతమైనటువంటి ట్రాఫిక్ జామ్ అవ్వడం లారీలు దిగబడిపోవడం నిరంతరం జరుగుతున్నాయని అన్నారు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇదివరకు గంట సమయం పట్టేదని ఇప్పుడు రెండు గంటలు పడుతుందని అన్నారు ఈ గుంటల కారణంగా అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయని ప్రయాణం అంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారని అన్నారు ఎప్పుడు ఏ బ్రిడ్జి కూలిపోతుందో తెలియని పరిస్థితిలో నియోజకవర్గంలో పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు ఇంకా ఎన్ని రోజులు ప్రజలు ఈ అవస్థలు పడాలని ప్రశ్నించారు ప్రజలు పడుతున్న ఈ ఇబ్బందులకు స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని అన్నారు కనీసం ప్రజలకు రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేని ఎడల గౌరవ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తక్షణమే బాజాప్తుగా తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు భద్రాచల నియోజకవర్గంలో ప్రజలు బిఎస్పీ అధికారాన్ని ఇవ్వాలని తద్వారా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు వీలైనంత త్వరగా ప్రభుత్వం పాడైపోయిన ఈ రోడ్డుకు మరమ్మత్తులు నిర్వహించాలని ప్రజలు పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలకాలని కోరారు లేనియెడల బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని ప్రజా సమస్య పరిష్కారం కోసం చట్టం పరిధిలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు సామల ప్రవీణ్ కుమార్, బివిఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ ములకాల సందీప్ , చర్ల మండల పార్టీ ఉపాధ్యక్షులు కొండా కౌశిక్ చెన్నం మోహన్, షేక్ జహీరుద్దీన్ పాషా. అయినవోలు శ్రీను. వాసు, చెన్నం పవన్ తదితరులు పాల్గొన్నారు.



## దుల్లా జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పంచకర్ల

**జయభేరి, పరవాడ:**

పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం జీవీఎంసీ 85 వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం గ్రామంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు దుల్లా రాము నాయుడు జన్మదినం సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆయన స్వగృహం నందు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రాము నాయుడుకేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు, మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్నా ,79 వార్డు అధ్యక్షుడు పిల్లా శివకృష్ణ , చింతకాయల ముత్యాలు, ఇందల రమణ, కేఎన్ఆర్, సత్యారావు, దాసరి తాతారావు,సత్తిరాజు,పెందుర్తి నియోజకవర్గ పరవాడ మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## కోన కుటుంబాన్ని పరామర్శించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం రావాడ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోన రామయ్య నాయుడు గుండెపోటుతో అకాల మరణం చెందడంతో వారి కుటుంబం సభ్యులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు.ఈ సందర్భంగా వారి యొక్క పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి యొక్క కుటుంబ సభ్యులకు భగవంతుని మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే పంచకర్ల కోరారు వీరితో పాటు పరవాడ మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న , మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథ రావు , మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, రావాడ గ్రామ సర్పంచ్ మోటారు సన్యాసి నాయుడు, బుగిడి రామ గోవింద తదితరులు ఉన్నారు.

## మెరిట్టోరియస్ అవార్డు గ్రహీత సత్యనారాయణకి అభినందనల వెల్లువ



**జయభేరి, పరవాడ:**

పరవాడ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న డి సత్యనారాయణకి అనకాపల్లి జిల్లాలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నాన్ టీచింగ్ తరపున మెరిట్టోరియస్ అవార్డు మన కళాశాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్ డి సత్యనారాయణ లభించినది.ఈ అవార్డును ఆగస్టు 15 రోజు జిల్లా కలెక్టర్ ఆఫీసులో తీసుకోవడం జరిగినది.ఈ సందర్భంగా సత్యనారాయణ కి కళాశాల అభినంద సభ ఏర్పాటు చేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అనకాపల్లి డిస్టిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మద్దిలి వినోద్ బాబు మరియు కళాశాల సిబ్బంది సాంబశివరావు, లక్ష్మీ కుమారి, కళ్యాణి, గణేష్, సత్యనారాయణ లక్ష్మి, శ్రీధర్, ఉషాకుమారి, లక్ష్మీకాంతం, రమణ, పద్మ, అప్పారావు, శేఖర్, బాబు, ఈశ్వర్ కళాశాల విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆదర్శ పాఠశాలకు నూతన బిల్డింగును మంజూరు

- బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (BSFI)



**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 20 :**

భోదాపురం గ్రామంలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక ఆదర్శ పాఠశాల ను బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వెంకటాపురం మండల నాయకులు సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ఐ వెంకటాపురం మండల అధ్యక్షులు ఎస్ సాయికుమార్ మాట్లాడుతూ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని వర్షం వస్తే విపరీతంగా కురుస్తుందని పై పెచ్చులు పిల్లల మీద రాలి పడుతున్నాయని ఏదో ఒక రోజు కులే ప్రమాదం ఉందని విద్యార్థుల ప్రాణాలకు హాని పొంచి ఉందని అన్నారు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను స్కూలుకు పంపించాలంటే భయపడుతున్నారని అన్నారు తక్షణమే ఈ పాఠశాలను ఉన్నతాధికారులు పరిశీలించాలని తక్షణమే శిథిలావస్థకు చేరిన ఈ బిల్డింగ్ ని తొలగించి నూతన బిల్డింగ్ ని మంజూరు చేసి త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేశారు తద్వారా విద్యార్థుల ఉపాధ్యాయుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు లేనియెడల ఈ సమస్య పరిష్కారానికై భారత రాజ్యాంగ పరిధిలో ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమిస్తామని ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ఐ నాయకులు ఎక్కల వెంకటేష్ దెబ్బకట్ల నాగరాజు సుంకరి రాజు పాల్గొన్నారు.




## హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆర్డీవో కి వినతి పత్రం

**జయభేరి, దేవరకొండ :**

ఈనెల 27 వ తేదీ నుండి మొదలయ్యే వినాయక నవరాత్రులు, శోభాయాత్ర నిర్వహణ కొరకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం చేయాలని హిందు ఉత్సవ సమితి దేవరకొండ అధ్యక్షులు కర్నాటి సురేష్ అన్నారు దేవరకొండ ఆర్డీవో కి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు వినాయక చవితి ఇంకా వారం రోజులే ఉన్నదని ఇప్పటివరకు ప్రభుత్వం చేయాల్సిన ఏర్పాట్లు ప్రారంభించలేదని వెంటనే అన్ని ప్రభుత్వ శాఖలు మరియు దేవాలయ, వినాయక మంటప నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించి సరైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి సుదర్శన్, దాసపత్రి రాము, గుండాల అంజయ్య, రెడ్డి శంకర్, పగిళ్ల సాగర్, జల్దా భాస్కర్,సముద్రాల సహదేవ్(దేవరకొండ వాసవి క్లబ్ అధ్యక్షులు), చండీశ్వర్, కటకం ప్రవీణ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా పై అవగాహన సదస్సు



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20:**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని రైతు వేదిక నందు బుధవారం నానో యూరియా పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ లు జెస్సి, తిరుమలరావు మాట్లాడుతూ నానో యూరియా అర లీటరు ఒక ఎకరాకు పై బాటుగా వేసుకోవాలని తెలిపారు. నానో యూరియా వాడకం ద్వారా రసాయన ఎరువులు వాడడం తగ్గించి రైతులకు ఆదాయం పెంచుతుందని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని,అధిక దిగుబడి పొందుటకు తోడ్పడుతుందని అన్నారు. నానో యూరియాలతో నిల్వ రవాణా చేయటం కూడా సులభం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గుర్రాల కనకరాజు, జక్కుల వెంకటేశం ,బిట్ట లక్ష్మీనరసింహారెడ్డి, బిట్ల సత్తిరెడ్డి, కొంతం వెంకటేశం, ఐలయ్య పాల్గొన్నారు.

## స్థలం మాదంటూ రౌడీలతో హల్ చల్

- కోర్టులో కేసు ఉందనీ చెప్పిన వినని రౌడీలు
- నోటీస్ బోర్డులను సైతం తొలగింపు

**జయభేరి, గజ్వేల్, ఆగస్ట్ 20 :**



పల్లెల్లో భూ ఆక్రమణకు పట్నం రౌడీలతో వచ్చి కోర్టు ఉత్తర్వులు ఉన్న బోర్డులను తొలగించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అక్రమార్కులాంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు క్రషర్ నిర్వాహకులు,గ్రామస్తులు. సిద్దిపేట జిల్లా ములుగు మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 89 లో 33 ఎకరాల 30 గుంటల భూమి దుబాయ్ సలీం ఖాన్ వ్యక్తి పేరు మీద ఉంది.

అయితే ఈ భూమిలో గత నలభై ఏళ్లుగా ఉంటూ అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో ఆశీర్వాద్ మెటల్ ఇండస్ట్రీ పేరిట క్రషర్ కంపెనీని నిర్వహిస్తున్నారు సలీం ఖాన్. కాగా ఈ భూమి కాలి స్థలంగా చూపి ఉన్నది లేనట్లుగా పంజాబ్ కి చెందిన మరో వ్యక్తి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల ప్రోద్భలంతో పంచనామా చేయించుకుని స్థలం మాదేనంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని క్రషర్ నిర్వాహకుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. అయితే ఏళ్లుగా ఇదే స్థలంలో క్రషర్ నిర్వహిస్తున్నామని,చుట్టూత గ్రామస్తుల పంటపొలాలు సైతం ఉన్నాయని ఆయన అన్నారు.



ఎప్పటి నుండో ఉన్న మా స్థలంలో కొంతమంది వ్యక్తులు రౌడీలను తెచ్చి కంపెనీ కార్మికులను, నిర్వాహకులను బెదిరింపులకు గురి చేయడం బాధాకరమని గ్రామస్తులు వాపోతున్నారు. ఏళ్లుగా ఈ కంపెనీలో సుమారు 150 మంది కార్మికులం ఉపాధి పొందుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

అయితే రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూమిని ఎక్కువ మంది వ్యక్తుల పేరిట డబుల్ రిజిస్ట్రేషన్లు చేయడంతో ఎక్సెస్ భూమి గా మారిందని తద్వారా ఈ సమస్య ఉత్పన్నమైందని గ్రామస్తులు తెలిపారు. కావున సంబంధిత రెవెన్యూ అధికారులు చొరవ చూపి ఈ భూ సమస్య పరిష్కారం చేయాలని వారు కోరుతున్నారు.

## పురపాలక సంఘం ఆరోగ్యశాఖ విజ్ఞప్తి

**జయభేరి, దేవరకొండ :**



20 ఆగస్టు ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రజా ఆరోగ్య చైతన్యం కొరకు డెంగ్యూ వ్యాధి సంక్షిప్త సమాచారము. డెంగ్యూ వ్యాధి అనేది ఎడిస్ ఈజిప్టై అనే దోమకాటు వల్ల సంభవిస్తుంది. ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన 5 నుండి 10 రోజులలో వ్యాధికారక డెంగ్యూ వైరస్ దోమలో వృద్ధి చెందుతుంది. ఆ దోమ కుట్టిన వారికి వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి బారిన పడిన వారిలో 99% మంది మామూలు జ్వరం, తలనొప్పి లాంటి లక్షణాలతో బాధపడి త్వరగానే కోలుకుంటారు. కాని ఒక్క శాతం మందిలో మాత్రమే ఈ వ్యాధి తీవ్రంగా వచ్చే అవకాశం ఉంది. డెంగ్యూ కారక దోమలు సాధారణంగా పగటిపూట కుడుతాయి. డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చును మరియు వ్యాధిని పూర్తిగా తగ్గించవచ్చును. కాని సరి అయిన చికిత్స తీసుకోనట్లయితే ప్రాణాంతకం కావచ్చు.

**డెంగ్యూ వ్యాధి లక్షణాలు :** తీవ్రమైన జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కంటి లోపలి భాగంలో నొప్పి, వాంతులు విరేచనాలు, కండరాలు, కీళ్ళ నొప్పులు, చర్మంపై దద్దుర్లు తీవ్రమైన కేసులలో మాత్రమే, పంటి చిగుళ్ళ నుండి రక్తస్రావం (తీవ్రమైన కేసులలో మాత్రమే).

**దోమకాటు నుండి మనం ఎలా కాపాడుకోవాలి :** పొడవైన చేతులు గల చొక్కాలు ధరించండి. ప్యాంట్ ధరించడం, మస్కిటో రీఫిలెంట్లను వాడటం, దోమ తెరలలో నిద్రించడం.

**దోమల పెరుగుదల ఎక్కడ జరుగుతుంది :** ఎడిస్ ఈజిప్టై దోమ నిలువ ఉన్న మంచి నీటిలో గుడ్లు పెడుతుంది. ఇండ్ల పరిసరాలలో నిల్వ ఉండే నీరు, వర్షపు నీరు ఎడిస్ ఈజిప్టై దోమల పునరుత్పత్తికి అనువైన ప్రాంతాలు. పాత టైర్లు, వాడని కుండీలు, నీటి తొట్టెలు, సిమెంట్ తొట్టిలు, వాడని చిన్న చిన్న పాత్రలు, కుండలు, పూలకుండీలు, కొబ్బరి బొండాలు, మూతలు లేని నీటి ట్యాంకులు, ఎయిర్ కూలర్లు సరిగా నిర్వహణ చేయబడని చెత్తలో చేరిన వర్షపు నీరు, మొదలగునవి.

**చికిత్స :** డెంగ్యూ వ్యాధికి చికిత్స లేదు. అతి ముఖ్యమైన విషయం రోగికి జ్వరం, నొప్పులనుండి ఉపశమనం కల్గించడం. అంతకు మించి ఇతర ఆంటిబయాటిక్స్ వాడకూడదు. డాక్టర్ సలహా లేనిది మందులు వాడకూడదు. జ్వరం అదుపుకు పారసిటమాల్ ట్యాబ్లెట్స్ వాడాలి

డెంగ్యూ వ్యాధి నిర్ధారణ : ప్రస్తుతం జ్వరం వచ్చిన మొదటిరోజునే వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయవచ్చును. డెంగ్యూ డే1 పరీక్షతో ఇది సాధ్యం.

**వైద్యుడ్ని ఎప్పుడు సంప్రదించాలి :** జ్వరం తగ్గిన 37 రోజులలో తీవ్రమైన కడుపు నొప్పి, చిగుళ్ళ నుండి రక్తం, నిరంతరం వాంతులు, అలసట, వాంతిలో రక్తం, శ్వాసరేటు పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, చికిత్స పొందాలి.

Friday Dryday అంటే ఏమిటి శుక్రవారం పొడి దినం అనే నినాదంతో ప్రజలను దోమల నుండి కాపాడడానికి ఉద్దేశించిన ఒక ప్రచార కార్యక్రమం. అవగాహనతో ఆరోగ్యాన్ని కాపాడుకునే ఒక ప్రత్యేక నినాదం. వారంలో ఒక్కరోజు అంటే శుక్రవారం రోజు ఇల్లు, ఇంటి పరిసరాలలో నిల్వ ఉన్న నీటిని తొలగించడం. ఇంటిలో ఉన్న నీటి తొట్టెలు, సిమెంట్ కుండీలు, డ్రమ్ములలో ఉన్న నీటిని మొత్తం పారబోసి, ఆరనిచ్చిన తరువాత నీరు నింపుకోవాలి. దీని వల్ల జీవిత చక్రంనకు అంతరాయం ఏర్పడుతుంది. లార్వాలు అంతరిస్తాయి. అన్ని రకాలదోమల ద్వారా వ్యాపించే వ్యాధులనుండి రక్షణ లభిస్తుంది.

# హైదరాబాద్‌పై భారాన్ని తగ్గించేలా ఫ్యూచర్ సిటీ

✍ జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 20:



భారతదేశానికే నమూనాగా, అంతర్జాతీయ నగరాలతో పోటీ పడే స్థాయిలో "ఫ్యూచర్ సిటీ"ని నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నగరం హైదరాబాద్ దక్షిణ భాగంలో 765 చ.కీ.మీ. విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా భవిష్య నగర అభివృద్ధి సంస్థ ను ఏర్పాటు చేసింది, ఇది తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) యాక్ట్ 1975 ప్రకారం పనిచేస్తుంది ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధికి అవతల ఏర్పడనున్న ఈ జోన్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వ ఆలోచన. ఈ నగరంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నివాస సముదాయాల నుంచి నడిచే దూరంలోనే విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగం, వినోద సేవలు లభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో "ఫ్యూచర్ సిటీ" ప్రాథమిక మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన సమీక్షా సమావేశంలో దీనిపై చర్చలు జరగగా, ఆయన సూచనల మేరకు మార్పులు చేసి తుది ప్రణాళిక త్వరలోనే ప్రకటించనున్నారు.ఫ్యూచర్ సిటీకి ఔటర్ రింగ్ రోడ్ , శ్రీశైలం హైవే, నాగార్జున సాగర్ హైవేలు సరిహద్దులుగా ఉండనున్నాయి. ఇది రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంకి సమీపంలో ఉన్న ప్రాంతం. ఇప్పటికే ఉన్న పారిశ్రామిక సంస్థల సమీపంలో విశాల భూమి లభ్యతతో, ఫ్యూచర్ సిటీ తెలంగాణ భవిష్యత్ ఆర్థిక శక్తికి కేంద్రంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ నగరంపై పడుతున్న ఒత్తిడిని తగ్గిస్తూ, స్మార్ట్ మౌలిక సదుపాయాలు కలిగిన, వేగవంతమైన ఆర్థిక వృద్ధి సాధించే ప్రత్యామ్నాయంగా ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తారు. అభివృద్ధి బాధ్యతను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చేపట్టింది. మాస్టర్ ప్లానింగ్ కోసం అంతర్జాతీయ స్థాయి సంప్రదింపు సంస్థల సహకారం తీసుకుంటున్నారు.ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌లో పర్యావరణ అనుకూలతలపై ప్రధాన దృష్టి సారించారు. వర్షపు నీటి నిర్వహణ కోసం పారిశ్రామిక, నివాస ప్రాంతాల్లో స్పాంజ్ పార్కులు ఏర్పాటు చేస్తారు. ఇవి నీటిని గ్రహించి వరదలను నివారించగలవు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు పునర్వినియోగ నీటి వ్యవస్థలు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానాన్ని అమలు చేస్తారు. అధిక సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్లు, గ్రీన్ కారిడార్‌లు, పాకెట్ పార్కుల నెట్‌వర్క్‌తో నగరం హరిత వాతావరణాన్ని బలోపేతం చేస్తుంది. "వాక్ టు వర్క్" కాన్సెప్ట్‌కు అనుగుణంగా నివాస సముదాయాలను క్లస్టర్ పద్ధతిలో రూపొందిస్తారురిజర్వ్ అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న జల వనరులు, జంతు ప్రదర్శనశాలలు, ఎకో టూరిజం జోన్‌లను సంరక్షిస్తారు. పర్యాటక, వ్యాపార సందర్శనల అభివృద్ధి కోసం హోటళ్లు, రిసార్టులు అభివృద్ధి చేస్తారు. మునిసిపల్ వ్యర్థాల నిర్వహణకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఈవేస్ట్ డిస్పోజల్, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుతో నగర శుభ్రత, ఆరోగ్యం మెరుగవుతుంది.

**ఫ్యూచర్ సిటీకి సంబంధించి ముఖ్యమైన జోన్‌లు**

ఈ నగరంలో పలు రంగాలపై ప్రత్యేకమైన జోన్‌లు ఉంటాయి... అవి, కృత్రిమ మేధస్సు, జీవశాస్త్రాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి. ఎలక్ట్రిక్ వాహనాలు, పవర్ స్టోరేజ్. పర్యాటకం, వినోదం, సినిమా నిర్మాణం. ఆరోగ్యం, విజ్ఞాన మౌలిక సదుపాయాలు

**ఫ్యూచర్ సిటీ ప్రత్యేకతలు**

భారతదేశంలోనే మొట్టమొదటి నెట్‌జీరో స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, ఇది విద్యుత్, నీటి పునర్వినియోగం, హరిత వనాల కలయికతో అభివృద్ధి అవుతుంది. 'లివ్, లెర్న్, వర్క్, ప్లే' ఫ్రేమ్‌వర్క్‌తో నగరం రూపుదిద్దుకుంటుంది. నివాస ప్రాంతాలు, ఉద్యోగ కేంద్రాలు, విద్యాసంస్థలు, వినోద కేంద్రాలు నడిచే దూరంలో అందుబాటులో ఉంటాయి. జాతీయ ప్రదర్శన ప్రాజెక్ట్‌గా దీనిని అభివృద్ధి చేస్తారు. ఇది భారత భవిష్యత్ నగరాల నమూనాగా మారనుంది.క్లస్టర్ ఆధారిత అభివృద్ధికు అనుగుణంగా పారిశ్రామిక, విద్యా, ఆరోగ్య, పర్యాటక జోన్‌లను ట్రాన్సిట్‌ఓరియెంటెడ్ కారిడార్‌లు, లాజిస్టిక్స్ హబ్‌లు కలుపుతాయి. డిజిటల్ ఫస్ట్ ప్లానింగ్తో జీఐఎస్, రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డులు, బిల్డ్ నౌ వంటి వ్యవస్థల ద్వారా పారదర్శక సేవలు అందిస్తారు.గ్లోబల్ ఎలైన్‌మెంట్కు అనుగుణంగా జికా, వరల్డ్ బ్యాంక్, AIIB వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రణాళికలు ఉన్నాయి.

**రహదారి అభివృద్ధి ప్లాన్**

ఫ్యూచర్ సిటీకి మరింత అనుసంధానాన్ని కల్పించేందుకు కొత్త రహదారి ప్రణాళిక రూపొందించబడింది. మొత్తం పొడవు: 41.5 కి.మీ. కాగా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ (నంబర్ 1) – ఇది ఔటర్ రింగ్ రోడ్ వద్ద రావిర్యాల ఇంటర్‌చేంజ్ (టాటా ఇంటర్‌చేంజ్) నుంచి, రీజనల్ రింగ్ రోడ్ వద్ద ఆమనగల్లు వరకు విస్తరించనుంది. ఫేజ్ 1లో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కి.మీ., ఫేజ్ 2లో భాగంగా మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమనగల్లు వరకు 22.3 కి.మీ. వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లు వేస్తారు. ఇది ఫ్యూచర్ సిటీ పరిధిలోని పారిశ్రామిక కారిడార్‌లను కలుపుతుంది.

ఈ రోడ్ ద్వారా SH19, NH765పై ట్రాఫిక్ తగ్గించడంతో పాటు, ఫ్యూచర్ సిటీకి ఆ రోడ్లతో వేగంగా చేరుకోవచ్చు.



## విద్యార్థుల కోసం వైద్య శిబిరం

✍ జయభేరి, చర్ల, ఆగస్టు 20 :

చర్ల హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూజ ఆధ్వర్యంలో మారుమూల ప్రాతంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం చర్ల మండల పరిధిలో ఉన్న ఉంజుపల్లి గ్రామంల్లో పాఠశాలలో, వద్దిపేట పాఠశాలలో నిర్వహించారు. ఈ శిబిరంలో 76 మందికి చిరు వ్యాధులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తుండడంతో అందరు అప్రమత్తంగా ఉండాలని, వివిధ రోగాలు వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్త వహించాలని, కాచి చలార్చిన నీటిని మాత్రమే త్రాగాలని, వేడి వేడిగా ఉన్న ఆహారం మాత్రమే తీసుకోవాలని అన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, తగుజాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రాథమిక కేంద్రంకి రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉంజుపల్లి టీచర్ నాగరాజు, శ్రీను, వద్దిపేట టీచర్ రాజకుమార్, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ గీత, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, అనసూర్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం చెక్కును అందజేసిన వల్లపు రెడ్డి



✍ జయభేరి, గుడిపల్లి :

గుడిపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎలుగూరి వల్లపు రెడ్డి తన స్వగృహంలో సీఎంఆర్ చెక్కును మంగళవారం పంపిణీ చేశారు. ఇటీవల అనారోగ్య కారణంతో మరణించిన కన్నెబోయన వెంకటేశ్వర్లు కుటుంబానికి 22,500 రూపాయల చెక్కును వాళ్ళ కుటుంబ సభ్యులు కన్నెబోయిన వెంకటమ్మకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు కవితలు పాల్గొన్నారు.

## గొల్లపల్లి గ్రామ పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి

- ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి
- దైవ చింతనతో మానసిక ప్రశాంతత కంకణాల వెంకట్ రెడ్డి



✍ జయభేరి, చింతపల్లి :

ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు.గురవారం చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి పండుగ సందర్భంగా కంకణాల వెంకట్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు.దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు.ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు.ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండేలా చూడాలని ఆయన వేడుకున్నారు.దేవాలయాల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుణ్య క్షేత్ర దర్శిని యాత్రలు



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుణ్య క్షేత్ర దర్శిని (యాత్రలు) పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఎమ్మెల్యే బాలునాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. దేవరకొండ ఆర్టీసీ డిపో వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను దేవరకొండ హాలియా ప్రాంత భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు, అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు జర్నలిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వర దేవాలయంలో చోరీ

✍ జయభేరి, వికారాబాద్:

వికారాబాద్ జిల్లా యాలాల మండలం సంగం ఖుర్దు గ్రామ సమీపంలోని సంగమేశ్వర దేవాలయంలో చోరీ జరిగింది. గుడిలో అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో గుడి ప్రాంగణంలోని సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. గుడిలోకి ప్రవేశించి ఉండేని పగలగొట్టి గుండెలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు.

ఉదయం గుడి పూజారి వచ్చి చూసేసరికి విషయం బయటికి వచ్చింది. పూజారి పోలీసులకు గుడి చైర్మన్ లకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## 8500 కోట్ల పెండింగ్ స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

✍ జయభేరి, దేవరకొండ :




జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి 8500 కోట్ల స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్లను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని 1000మంది విద్యార్థులతో ర్యాలీగా బయలుదేరి RDO కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించి RDO P. రమణారెడ్డి కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పీజీ, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ,ఇంటర్మీడియట్, వృత్తి విద్యా కోర్స్ విద్యార్థులకు గత నాలుగు సంవత్సరాలుగా స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ప్రవేట్ కళాశాల యజమాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విధంగా ప్రభుత్వం బహుజన వర్గ విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరిని చూపిస్తూ విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా చేసే విధంగా అగ్రవర్ణ అధికార ప్రభుత్వం మోసం చేసే విధంగా ప్రవర్తిస్తుందని, ఎన్నిసార్లు ధర్నాలు,రాస్తారోకోలు వినతి పత్రాలు అందించినప్పటికీ నిమ్మకు నీరు ఎత్తిన విధముగా ప్రవర్తిస్తున్నారు. ఈ విధంగా ప్రవర్తిస్తే పెండింగ్ లో ఉన్నటువంటి బకాయిలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేయడానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చోళ్ళేటి భాస్కరాచారి, వరికుప్పల శ్రీను ఆర్మీ, పున్న వెంకటేష్ నేత, రెడ్డి కోటేష్, దామర శ్యామ్ సన్, సుందర్, రెడ్డి యాదయ్య, పల్చ శ్రీనివాస్ గౌడ్, నీలం అంజి, ఆల్ ఇండియా సమత సైనిక్ నాయకులు బుర్రి వెంకన్న, జిల్లా రాములు, ఎండి ఖాదర్ బాబా, కానుగుల మోహన్, మల్లేష్, అంజి, వెంకట నారాయణ, శ్రీను, రెడ్డి ఆంజనేయులు, రెడ్డి శ్రీశైలం, గుణమోని రామాంజు, జింకల ఏడు కొండలు, రెడ్డి నరసింహ, గండూరి లక్ష్మణ్ ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థిని, విద్యార్థులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

✍ జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20:



తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని శ్రీ రామాలయం పక్కన పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాన్ని విగ్రహ దాత కోల సుగుణమ్మ ఆంజనేయులు నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ పాండురంగ ఆశ్రమ వేద పండితుల ఆధ్వర్యంలో బుధవారం వరుణన యానం, కలశ స్థాపన, అఖండ దీపారాధన ,గణపతి పూజ, పుణ్యాహవాచనం ,రుత్విక్ వరణము, సర్వతోభద్ర మండలం, వాస్తు మండలం ,మాతృకో మండల స్థావనం, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం, షోడషావచార పూజ, హారతి , ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు, సాయంకాల పూజ, ఆవనం, షయ్యదివాస కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం రోజున స్థాపిత దేవత హవనం, మూల మంత్ర జపం, కుంబాభిషేకం, గర్తసంస్కారం, యంత్ర ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వేద బ్రాహ్మణులు అప్పల సత్యనారాయణ శర్మ ,అప్పల గోపాల శర్మ, అప్పల రాధాపతి శర్మ, అప్పాల భవానంద శర్మ, గోపరాజు సత్యం, గోపరాజు ప్రణయ్, గోపరాజు ప్రణీత్ ,రఘు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

- అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

✍ జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :

కాళేశ్వరం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సి డబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డీ ఆర్ ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు సూచనలు చేశారు.


## కేబుల్ వైర్లు కట్ చేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి

✍ జయభేరి, హైదరాబాద్ :

రామంతాపూర్ ఘటనలో కేబుల్ ఆపరేటర్లని అనవసరంగా బద్నాం చేస్తున్నారని కేబుల్ ఆపరేటర్ అసోసియేషన్ నేతలు అన్నారు. రామంతపూర్ లో జరిగిన ఘటనకు కేబుల్ ఆపరేటర్లుగా మేము సానుభూతి తెలియజేస్తున్నాం. కేబుల్ కట్ చేయడం వల్ల లక్షల మంది యూజర్స్ కి అంతరాయం జరిగింది. 80% కేబుల్స్ కట్ చేయడం వల్ల లక్షల రూపాయల నష్టం ఉంటుంది. కేబుల్ వైర్లు కట్ చేయడం వల్ల లక్ష మందికి పైగా ఉద్యోగులు నష్టపోతాం. బమ్మల్ని అడిగి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేది. దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలనిఅన్నారు.

# ఖజానాకు భారంగా తాయిలాలు

✍ జయభేరి, విజయవాడ, ఆగస్టు 20:




ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో సంక్షేమ పథకాల పేరుమీద జరుగుతున్న తాయిలాల పంపకం ఖజానాకు పెనుభారంగా మారుతోంది. గతంలో వైసిపి, ప్రస్తుత కూటమి పోటీపడి మరీ అప్పుల మీద అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిజానికి అవసరంలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ దానకర్ణులు అనిపించుకోవడం కోసం సరైన రాబడి రాకుండానే ఇలా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం అప్పుల మీద అప్పులు చేస్తూ వెల్ఫేర్ స్కీమ్ అమలు చేస్తున్న తీరు మేధావి వర్గాల్లో ఏపీ భవిష్యత్తుపై ఆందోళన పెంచుతోంది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024 లో దిగిపోయేసరికి కేవలం సంక్షేమ పథకాలు కోసం ప్రతి ఏటా 70 వేల కోట్ల వరకూ ఖర్చుపెట్టినట్టు ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. దీనికోసం వివిధ కార్పొరేషన్లలోని డబ్బులు సైతం వాడేసారని, ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టి మరీ అప్పులు తెచ్చారని టిడిపి, జనసేన తీవ్రంగా ఆరోపించేవి. ఏపీలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది అనేది వారి ప్రధాన విమర్శగా ఉండేది. అమ్మ ఒడి, నాడు నేడు లాంటి పథకాల వల్ల చాలామందికి మేలు జరిగిన మాట వాస్తవమే అయినా మిగిలిన అనేక పథకాల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది అనేది చాలామంది ఎనలిస్ట్ లు, ఆర్థిక వేత్తల అభిప్రాయం. అటు అమరావతి పక్కకు పోయి, మూడు రాజధానుల వ్యవహారం బెడిసి కొట్టి, పోలవరం ప్రాజెక్టు అతిగతీ లేని పరిస్థితుల్లో పడిపోవడం తో చివరికి సంక్షేమ పథకాలు సైతం జగన్ ప్రభుత్వాన్ని కాపాడలేకపోయాయి. అప్పట్లో రాష్ట్రం లోని రోడ్ల పరిస్థితులపై సామాన్యులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులు తీవ్ర అసంతృప్తి వెళ్ళబుచ్చేవారు. విచిత్రంగా వీరిలో చాలామంది సంక్షేమ పథకాల లబ్ధిదారులే కావడం విశేషం. అంటే ప్రజలకు సంక్షేమంతో పాటుగా అభివృద్ధి, కనీస సౌకర్యాలు ముఖ్యమనేది చాలా స్పష్టంగా పాలకులకు తెలియజేసిన ఎన్నికల ఫలితాలు అవి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రో డెవలప్మెంట్ లీడర్గా చంద్రబాబుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా ఆర్థిక పరమైన సంస్కరణలకు ఏమాత్రం వెనుకాడే వ్యక్తి కాదని చంద్రబాబు నాయుడు పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టడానికి ముఖ్యమైన కారణం ఇదే. 2024 ఎన్నికల్లోనూ ప్రజలు చంద్రబాబుపై రాష్ట్ర అభివృద్ధి అనే యాంగిల్ లోనే ప్రధానంగా ఓట్లు వేశారు. కేవలం సంక్షేమ పథకాలు కోసమే అయితే ఆ ఓటు జగన్ కే వేసి ఉండేవారన్న అభిప్రాయం చాలా మంది రాజకీయ నేతల నుండి వెలువడుతోంది. కానీ చంద్రబాబు మాత్రం సంక్షేమ పథకాలలో కూడా తన ముద్ర చూపే దిశగా ఒకదాని వెంట ఒకటి పథకాలు అమలుచేసుకుంటూ వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే డెస్పరేషన్ తో ఇచ్చిన హామీలపై అప్పట్లోనే మేధావివర్గాల నుంచి విమర్శలు వెలువడ్డాయి. ముఖ్యంగా 20లక్షల మంది యువకులకు నెల నెలా 3000 చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు 1500 చొప్పున ఇస్తామన్న హామీ లపై అవెలా సాధ్యమన్న విమర్శలు బలంగా వచ్చాయి. దానికి తగ్గట్టే ఇటీవల రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు కూడా "మహిళలకు 1500 చొప్పున ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ "ఏపీ ఆర్థిక పరిస్థితి గురించి చెప్పకనే చెప్పారు. ఎన్నడూ లేనట్టు మూడు లక్షల ఇరవై రెండు వేల కోట్లతో ప్రవేశ పెట్టిన 202526 ఏపీ బడ్జెట్లో కూడా వీటి పై స్పష్టత ఇవ్వలేదు. అయినప్పటికీ బడ్జెట్లో అధిక భాగం సంక్షేమ పథకాలకు కేటాయించారు. ఏపీ జీవనాడి అయిన పోలవరానికి బడ్జెట్ లో కేటాయించింది 6300 కోట్లు మాత్రమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నామని చెబుతూనే ఆర్థిక మంత్రి రెవిన్యూ లోటు 33 వేల కోట్లు, ద్రవ్య లోటు దాదాపు 80000 కోట్లుగా పేర్కొన్నారు. సంక్షేమ పథకాల మాట ఎలా ఉన్నా ఏపీ ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకుంటున్నవి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం, రాజధాని కి ఒక రూపం రావడం. వీటి తోపాటు గుంతలు లేని రోడ్లు,లోపాలు లేని విద్య వైద్య సౌకర్యాలు. ప్రస్తుతం ఒకరిపై ఒకరు పోటీపడి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు ప్రభుత్వం నుంచి కోరుకుంటున్న అంశాలకు అడ్డుకట్టుగా మారిపోయే ప్రమాదం లేకపోలేదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఈ సంక్షేమ పథకాల హామీ లను మరింతగా పెంచే పనిలో కచ్చితంగా రాష్ట్రం లోని పార్టీలు పడతాయి. నిజం చెప్పాలంటే జగన్,చంద్రబాబు ఒక విధమైన పులి స్వారీ చేస్తున్నారనే చెప్పాలి. సవారీ చెయ్యలేరు.. అలాగని కిందకు దిగనూ లేరు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోకుండా ఉచిత హామీలతో పరుగులు పెట్టడంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి కట్టుగా చర్చించి ఒక కీలక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసిందని అభిప్రాయపడ్డారు సీనియర్ రాజకీయవేత్త, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్. ఆయన ప్రస్తుతం జాతీయ పార్టీ బిజెపిలో సభ్యుడిగా ఉన్నారు. ఇలా అన్ని పార్టీలు ఉచితాలకు సంబంధించిన హామీలపై ఒక బ్రేకుల్లేని విధానంతో ముందుకు సాగడం భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థకు చేటు చేయడంతో పాటు పేదలను మరింత పేదలుగా మార్చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు.



# ఇస్రో జంబో రాకెట్ ప్రయోగం

✍ జయభేరి, నెల్లూరు, ఆగస్టు 20:

ఇస్రో భారీ టార్గెట్నే ఎంచుకుంది. ఇప్పటికే ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా చేసిన ఇస్రో శాస్త్ర వేత్తలు.. ఇప్పుడు జంబో రాకెట్ ప్రయోగానికి రెడీ అవుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 40 అంతస్తుల పొడవైన ప్రాజెక్ట్కు ప్రణాళికలు రెడీ చేస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో ఘనత సాధించేందుకు రెడీ అయింది. ఈసారి ఏకంగా 40 అంతస్తుల పొడవైన రాకెట్ ద్వారా 75 టన్నుల ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఈ విషయం వెల్లడించారు. 35 కిలోల పేలోడ్తో మొదలు పెట్టిన భారతీయ అంతరిక్ష ప్రయాణం.. ఇప్పుడు 75,000 కిలోల బరువైన ఉపగ్రహాలను లో ఎర్త్ ఆర్బిట్ లోకి తీసుకెళ్లగలిగే ఒక మెగా రాకెట్ను తయారు చేసే స్థాయికి ఎదిగిందన్నారు.అంతరిక్ష ప్రయోగాల్లో ఇది ఒక 'గేమ్ఛేంజర్'గా మారబోతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అగ్రగామిగా ఉన్న అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలు కూడా ఇలాంటి సూపర్హెవీ లాంచ్ వెహికిల్స్ను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ జాబితాలో భారత్ చేరడం ద్వారా.. అంతర్జాతీయ అంతరిక్ష యానంలో మన స్థానం మరింత పదిలం అవుతుంది. వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ మార్కెట్ లో మన దేశ వాటా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్కు కక్ష్యలో 55 ఉపగ్రహాలు ఉన్నాయి. వచ్చే మూడు లేదా నాలుగేళ్లలో వీటి సంఖ్య మూడు లేదా నాలుగు రెట్లు పెరగనుందున్నారు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాలకు ఇస్రో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. చంద్రయాన్3, మంగళ్యాన్ వంటి మిషన్ల విజయాలు మనకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చిపెట్టాయి.ఈ మెగా రాకెట్ కేవలం అంతరిక్ష పరిశోధనలకు మాత్రమే పరిమితం కాదు. దీనికి వ్యూహాత్మక ప్రాముఖ్యత కూడా ఉంది. దీని ద్వారా రక్షణ రంగానికి అవసరమైన భారీ కమ్యూనికేషన్, నిఘా ఉపగ్రహాలను సులభంగా అంతరిక్షంలోకి పంపవచ్చు. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో దేశ రక్షణ సన్నద్ధతను ఇది మరింత బలోపేతం చేస్తుంది. భవిష్యత్తులో దేశ భద్రతకు, ఆర్థిక ప్రగతికి అంతరిక్ష సామర్థ్యం ఒక కీలకమైన అంశంగా మారనుంది. మరోవైపు ఇస్రో ఈ ఏడాది డిసెంబర్లో తన గగన్యాన్1 టెస్ట్ మిషన్ ప్రయోగానికి కూడా సిద్ధమవుతోంది. ఇటీవలే యాక్సియమ్4 మిషన్ ద్వారా తన అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చిన శుభాంశు శుక్లా అనుభవం ఈ భారత తొలి మానవసహిత అంతరిక్ష మిషన్కు కీలకం కానుంది.

# ముదిరాజ్ పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశం

- సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నీలం మధు ముదిరాజ్
- ముదిరాజులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలను కలుపుకొని త్వరలో జేపీసీ ఏర్పాటు చేస్తాం... నీలం మధు

✍ జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 20 :



తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ముఖ్య నాయకులు సమావేశం పటాన్చెరువులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ కాంటెస్టెడ్ ఎంపీ నీలం మధు ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ; తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి సభ విజయవంతం అయినందుకు రాష్ట్ర ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. గ్రామస్థాయి ప్రతి ఒక్కరిని చైతన్యం చేయాలని జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ మరియు డి గ్రూప్ నుంచి ఏ గ్రూప్ కి చేర్చాలని ఎంతోమంది ఎదురుచూస్తున్న ఈ విషయాన్ని త్వరలో సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని ముదిరాజులతో పాటు ఎస్సీ ,ఎస్టీ, బీసీ, కులాలను కలుపుకొని త్వరలో జేఏసీ ఏర్పాటు చేస్తామని బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అందరూ ఒకటయ్యే సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నార బోయిన శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు సుంకరబోయిన మహేష్ మరియు తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి , వర్కింగ్ ప్రెసిడెంట్ కాసబోయిన శేఖర్ ముదిరాజ్, మాట్లాడుతూ ఐక్యమత్యంతో ముందుకు వెళ్లిన రోజే విజయం సాధిస్తామని ప్రతి ఒక్కరి సలహా తీసుకొని రాబోయే కాలంలో అత్యధిక జనాభా ఉన్న జాక్, కమిటీ ద్వారా సరైన అభ్యర్థులను , కాన్సెన్సీలో పోటీ చేయాలని అన్నారు, నాయకులు రంజిత్ శేర్లింగంపల్లి రవికుమార్ దేవేందర్ బిసి నాయకులు బంగారు మల్లేష్ కరుణాకర్, రాగుల రాజు జోగాని రవి, నిమ్మకాయల గణేష్ దేవరాజ్ ,జన వెల్లి శ్రీనివాస్, స్వామి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి

- మొగలిగిద్ద గ్రామంలో మహాలక్ష్మి ఎలక్ట్రికల్ షాపును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్

✍ జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 20 :




వ్యాపార రంగంలో రాణించాలన్న, ఆర్థికంగా ఎదగాలను నాణ్యత ప్రమాణాలు పాటించడం తప్పనిసరి అని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన శివకుమార్ నూతనంగా నెలకొల్పిన మహాలక్ష్మి ఎలక్ట్రికల్ షాప్ ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడంతోపాటు, నిత్య అందుబాటులో ఉండాలని సూచించారు. పోటీ ప్రపంచంలో ఆర్థికంగా ఎదగాలంటే ఇప్పటికప్పుడు మార్కెట్ డిమాండ్ అంచనా వేస్తూ, వినియోదారులకు నాణ్యమైన వస్తువులను అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో సైతం పట్టణాలకు దీటుగా ఎలక్ట్రికల్ షాప్ లను నిర్వహించడం అభినందనీయమని, స్వయం ఉపాధితో రాణించాలనే దృఢసంకల్పంతో వ్యాపార కేంద్రాలను నెలకొల్పడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగానే షాప్ నిర్వాహకులు శివ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, నటరాజ్, నాయకులు బుగ్గకృష్ణ, బాలరాజు, మహేష్, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ విశ్వనాథ్ కు బ్రెస్ట్ క్యాన్సర్ పరిశోధనపై డాక్టరేట్

✍ జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20:

బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సలో నూతన మార్గాలను అన్వేషిస్తూ విశ్లేషణాత్మక పరిశోధనలు చేసిన డాక్టర్ విశ్వనాథ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ బిరుదు లభించింది. ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాల్లో ఆయన చేసిన సాంకేతిక, సుస్థిర పరిశోధనలకు గుర్తింపు వచ్చినది. ఈ గొప్ప పరిశోధనకు గుర్తింపుగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ న్యూఢిల్లీ నుండి సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అవార్డు కూడా ఆయనకు లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎర్రగుంట విశ్వనాథ్ మాట్లాడుతూ ఈ విజయాన్ని నా తల్లిదండ్రులు, గురువులు, పరిశోధన మార్గదర్శకులు, స్నేహితుల మద్దతు వల్ల సాధించగలిగానని అన్నారు. తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువులు చదువుకొని ఇంతటి ఘనత సాధించినందుకు గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## హైస్కూల్లో ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభం



✍ జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20:

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ గుండెబోయిన కృష్ణమూర్తి యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మాజీ యూత్ అధ్యక్షుడు బాలు యాదవ్ మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ గోడ సమస్య ఉందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఐదు లక్షల రూపాయల ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేశారని అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజూష రాణి, ఉపాధ్యాయులు మహేష్, స్వామి, కవిత ,సుభాషిని గ్రామస్తులు గుండెబోయిన కొమరయ్య, కోట బిక్షపతి, బొడ్డు బాల నరసింహ, గుంటి బాల మల్లేష్, గుంటి గణేష్, గుండెబోయిన మహేష్, మల్లెబోయిన కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై బెల్టు, ఐడి కార్డులను బహుకరించిన ఉపాధ్యాయురాలు




✍ జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 20:

తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు మీనాదేవి విద్యార్థులకు టై బెల్టులు, ఐడి కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏఏపిసి చైర్మన్ ఆకుల విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పై బెల్టులు అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణ, రాధిక, మీనా, రమేష్, రజియా బేగం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- జయంతి సందర్భంగా విగ్రహానికి నివాళులు అర్పించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



✍ జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 20 :

దివంగత మాజీ ప్రధాని రాజీవ్గాంధీ జయంతి నివాళీ వేడుకలు షాద్ నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ; ప్రధానిగా రాజీవ్ దేశంలో అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఐటీ, టెలికాం రంగాల పురోగతికి ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్గాంధీ,దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన కుటుంబం మొత్తం దేశానికి, దేశ ప్రజల సేవలకే అంకితమైందన్నారు. ప్రధానిగా రాజీవ్గాంధీ అనేక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అభివృద్ధి చేశారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# విశ్వంభర రిలీజ్ డేట్ చెప్పిన చిరు..

మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర' . ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న వశిష్ఠ (బింబిసార ఫేమ్) దర్శకత్వం వహిస్తుండగా, చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం ఇప్పటికే చాలా సార్లు వాయిదా పడింది.వాస్తవానికి 2025 సంక్రాంతి కే ఈ సినిమా రిలీజ్ కావల్సి ఉన్నా సమ్మర్‌కి పోస్ట్ పోన్ చేశారు. కాని అప్పుడు మూవీ రిలీజ్ కాలేదు. కనీసం తర్వాత రిలీజ్ డేట్ కూడా చెప్పలేదు. అయితే ఇప్పటికే మూవీకి సంబంధించి విడుదలైన గ్లింప్స్ కి నెగిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా వి.ఎఫ్.ఎక్స్ గురించి చాలా నెగిటివ్ కామెంట్స్ వినిపించాయి. దీంతో నిర్మాతలు క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాకూడదు అని భావించి మూవీని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. క్వాలిటీ ఔట్ పుట్ తోనే సినిమాని జనాల్లోకి వదలాలని భావించారు చిత్ర బృందం. అయితే చిరంజీవి బర్త్ సందర్భంగా మూవీ టీజర్‌ని ఈ రోజు సాయంత్రం 6.06ని.లకి టీజర్ విడుదల చేయబోతున్నారు. కొద్ది సేపటి క్రితం యూవీ క్రియేషన్ చిన్న వీడియోని విడుదల చేయగా, ఇందులో చిరంజీవి ఆసక్తికర విషయాలు తెలియ జేశారు. మూవీ ఆలస్యానికి కారణం మీకు అత్యున్నత ప్రమాణాలతో, బెస్ట్ క్వాలిటీతో మూవీని మన ముందుకు తీసుకురావాలనే చిత్ర బృందం ఇంత సమయం తీసుకుంటుందని చిరంజీవి అన్నారు. ఇది చందమామ కథలాగా సాగిపోయే అద్భుతమై కథ. చిన్న పిల్లలతో పాటు పెద్దవా ళ్లలో ఉండే చిన్న పిల్లలకి ఈ సినిమా బాగా నచ్చుతుంది అని చిరంజీవి అన్నారు. ఇక మూవీని 2026 సమ్మర్‌కి విడుదల చేయనున్నట్టు చిరంజీవి స్వయంగా చెప్పుకొచ్చారు.

మూవీ విషయానికి వస్తే.. ఈ చిత్రం భారత పురాణాల ఆధారంగా రూపొందుతున్న ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్. "మన పురాణాల ప్రకారం మొత్తం 14 లోకాలు ఉన్నాయని చెబుతారు. యమలోకం, పాతాళం, స్వర్గం వంటి వాటి వరకు సినిమాల్లో చాలామంది చూపించారు. కానీ 'విశ్వంభర'లో ఆ 14 లోకాలకు మూలమైన 'సత్యలోకాన్ని' చూపించబోతున్నాం అని ఇటీవల దర్శకుడు చెప్పుకొచ్చారు. ఈ కథలో కథానాయకుడు ఆ లోకానికి ఎలా వెళ్తాడు? అక్కడి నుంచి కథానాయికను భూమిపైకి ఎలా తీసుకొస్తాడు? అన్న అంశం చుట్టూ సినిమా ఉంటుందని చెప్పాడు. ఇది ఒక రకమైన మిస్టిక్ యాత్రగా ఉంటుందని సమాచారం. ఈ సినిమా కోసం భారీ బడ్జెట్‌తో అద్భుతమైన సెట్స్ వేసి చిత్రీకరణ జరుపుతున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. ప్రతీ సన్నివేశం గొప్ప విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడి ఉండేలా డిజైన్ చేస్తున్నారు. అందుకే ఇది చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత విజువల్‌గా రిచ్ సినిమా అవుతుందని భావిస్తున్నారు. చిరంజీవికి జోడీగా త్రిష నటించగా, మరో కీలక పాత్రలో ఆషికా రంగనాథ్ కనిపించనున్నారు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నప్పటికీ, ఇది పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు ఇతర భాషలలో కూడా విడుదల కానుంది.

# స్పెషల్‌రోల్ ఖాయమేనట?



రజనీకాంత్ 'జైలర్ 2'లో బాలకృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించబోతున్నారన్న వార్త వచ్చిన నాటి నుంచీ బాలయ్య అభిమానులేకాదు, సగటు ప్రేక్షకుడు సైతం ఆ కాంబినేషన్‌ను చూడాలని ఉవ్విళ్లూరారు. ఇంతలోనే అవన్నీ పుకార్లని, 'జైలర్ 2'లో బాలయ్య నటించడం లేదని కొన్ని వెబ్‌సైట్లు రాశాయి. దాంతో అంతా నీరుగారిపోయారు. అసలు నిజంపై ఇంకా ఎవరికీ క్లారిటీ లేదు. అయితే.. తాజా చెన్నై సమాచారం ప్రకారం. బాలకృష్ణ 'జైలర్ 2'లో నటించడం ఖాయమేనట. ఇందులో ఆయన ఓ పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కనిపించబోతున్నారట. కాకపోతే.. సెట్‌లోకి బాలయ్య ఎంట్రీకి ఇంకాస్త సమయం ఉందని, ప్రస్తుతం రజనీకాంత్‌పై దర్శకుడు నెల్సన్ కీలక సన్నివేశాలను తెరకెక్కించే పనిలో ఉన్నారని, 'జైలర్'ని మించిన ఎమోషన్స్, ఎలివేషన్స్ 'జైలర్ 2'లో ఉంటాయని తెలుస్తున్నది. మరోవిషయం ఏంటంటే.. 'జైలర్'లో స్పెషల్‌రోల్స్‌లో కనిపించిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ 'జైలర్ 2'లో కూడా ఉంటారట. అంటే.. మొత్తంగా బాలయ్యతో కలిపి నలుగురు సూపర్‌స్టార్లు ఈ సినిమాలో భాగం కానున్నారన్నమాట. ప్రేక్షకులకు ఇంతకు మించిన కన్నుల పండుగ మరొకటి ఉండదని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు.



# కుర్రాళ్ళ గుండె గుల్ల చేస్తున్న నివేదా..

మోడల్ గా కెరీర్ ప్రారంభించిన నివేదా పేతురాజ్ ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. ఈ చిన్నది 2016లో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఈ క్రమంలోనే.. తమిళ, తెలుగు చిత్రాలలో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఒరు నాల్ కూతు (2016) అనే తమిళ చిత్రంతో నివేదా పేతురాజ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆతర్వాత తెలుగులో మెంటల్ మదిలో చిత్రంతో అరంగ్రేట్రం చేసింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా తెలుగులో నటించింది. సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన చిత్రలహరి సినిమాలో సెకండ్ హీరోయిన్ గా చేసింది. బ్రోచేవారె వరురా, అల వైకుంఠపురములో, బ్లడీ మేరీ, విరాట పర్వం ,దాస్ కా ధమ్కీ నటించింది. విశ్వక్ సేన్ హీరోగా నటించిన దాస్ కా ధమ్కీ సినిమాలో నటనతో పాటు తన అందంతో ఆకట్టుకుంది ఈ బ్యూటీ. ఇక రీసెంట్ గా పరువు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ చిన్నది. ఓటీటీలో రిలీజ్ అయిన ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నివేదా పేతురాజ్ మాట్లాడుతూ.. ఆస్కతికర వ్యాఖ్యలు చేసింది. ఈ రోజుల్లో అందరూ లవ్ చేయడం లేదా డేటింగ్ చేస్తున్నారు. చాలా మంది సింగిల్ గా ఉండటానికి భయపడుతున్నారు అని తెలిపింది. అలాగే అమ్మాయిలు డేటింగ్ చేసే ముందు ఆ అబ్బాయి గురించి బాగా తెలుసుకోవాలి. ముందు ఫ్రెండ్షిప్ చేసి ఆ తర్వాత డేటింగ్ చేయాలి అని చెప్పుకొచ్చింది.



# మైండ్ బ్లాక్ చేస్తున్న వయ్యారి భామ..

'హోరా హోరి' చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది ముంబై బ్యూటీ దక్షా నగార్కర్. ఆ తర్వాత హుషారు సినిమా సక్సెస్ తో యూత్ లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ వెంటనే జాంబీ రెడ్డి సినిమాలో హీరోయిన్ గా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తన గ్లామర్ తో కట్టిపడేసింది. అలాగే కింగ్ నాగార్జున, నాగచైతన్య నటించిన బంగార్రాజు సినిమాలో చిన్న పాత్రతో పాటు స్పెషల్ సాంగ్ లో మెరిసింది ఈ భామ. ప్రస్తుతం ఈ చిన్నది మాస్ మహారాజ్ రవితేజ నటిస్తోన్న 'రావణాసూర'లోనూ అవకాశం అందుకుంది. ఈ సినిమా పై దక్షా నగార్కర్ చాలా హోప్స్ పెట్టుకుంది. కానీ ఈ సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించలేదు. ఇదిలా ఉంటే దక్షా నగార్కర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. సినిమాలకు గ్యాప్ ఇస్తున్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడు అభిమానులతో టచ్ లోనే ఉంటుంది. నెట్టింట ఈ అమ్మడి అందాలకు కొదవే లేదు.. హాట్ హాట్ ఫొటోలతో కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ఈ క్రేజీ బ్యూటీ. తాజాగా ఈబ్యూటీ పోస్ట్ చేసిన ఫోటోలు యువతకు నిద్రపట్టనివ్వడం లేదు. దక్షా నగార్కర్ ఈ ఫొటోల్లో చాలా హాట్ గా కనిపించింది. ఈ అందం ఇక్కడిది కాదు దేవలోకం నుంచి దిగివచ్చింది అంటూ కుర్రాళ్ళు కొంటె కామెంట్స్ చేస్తున్నారు.

# బిగ్ బాస్ ప్రీ షో కోసం వెయిటింగ్...

## ఎప్పటి నుండి ఎప్పటి వరకు, ఎన్ని ఎలిమినేషన్స్ జరిగాయంటే..!




బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సీజన్ మరికొన్ని రోజుల్లోనే గ్రాండ్ లాంచ్ కానుండగా, దానికి ముందు ప్రత్యేక ప్రీషో 'బిగ్‌బాస్ అగ్నిపరీక్ష రూపుదిద్దుకుంటుంది. ప్రస్తుతం ఈ షో షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రోమోలు ప్రేక్షకుల్లో భారీగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఆగస్టు 22, 2025 నుంచి బిగ్‌బాస్ అగ్నిపరీక్ష ప్రీషో జియో హాట్‌స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది.

ఈ షో ప్రతి రోజు ఒక గంట పాటు ప్రసారం అవుతుంది.

ఆగస్ట్ 22 నుండి సెప్టెంబర్ 4 వరకు అంటే సరిగ్గా రెండు వారాల పాటు ఈ ప్రత్యేక ప్రీషో నడవనుంది. ఈసారి బిగ్‌బాస్ హౌస్‌లో ప్రవేశించేందుకు 45 మంది కామన్ పీపుల్ పోటీ పడుతున్నారు. ఇప్పటికే రెండు ఎలిమినేషన్లు కూడా జరిగిపోయినట్లు సమాచారం. ఈ 45 మందిలో కొందరు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కూడా ఉన్నారు.

అయితే చివరకు ఆరుగురు మాత్రమే తమ టాలెంట్‌తో హౌస్‌లో అడుగుపెట్టనున్నారు. ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా కంటెస్టెంట్ల ఎంపిక జరగలేదు, ఇది పూర్తిగా కొత్త ఫార్మాట్ మాదిరిగా కనిపిస్తుంది.

షోకు ప్రముఖ యాంకర్ శ్రీముఖి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. న్యాయనిర్ణేతలుగా నవదీప్ , అభిజీత్, బిందు మాధవి వ్యవహరిస్తున్నారు. వీరి జడ్జ్‌మెంట్ ఆధారంగా ఆ ఆరుగురు ఎవరనేది నిర్ణయించబడుతుంది. 'అగ్నిపరీక్ష' ప్రీషోతో బిగ్‌బాస్ 9 సీజన్‌కు ఓ వినూత్న ఆరంభం లభించనుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ ఫార్మాట్ ద్వారా అసలైన టాలెంట్‌కు గుర్తింపు దక్కే అవకాశం ఉండటంతో, ప్రేక్షకుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. సోషల్ మీడియాలో ఇప్పటికే బిగ్ డిబేట్స్, అంచనాలు మొదలయ్యాయి. సెప్టెంబర్ మొదటి వారంలో 'బిగ్‌బాస్ తెలుగు 9' అధికారికంగా ప్రారంభం కానుంది. అంతవరకూ 'అగ్నిపరీక్ష'తో మంత్రముగ్ధులను చేసే ప్రయత్నంలో షో టీం ఉంది. మొత్తానికి ఈసారి బిగ్‌బాస్ మామూలుగా ఉండదని హై వోల్టేజ్ డ్రామా, ఎమోషన్స్, ఎంటర్టైన్మెంట్‌తో మోత మోగించబోతున్నదనే చెప్పొచ్చు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com